



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	27	33
భద్రాద్రి	25	38



ఖమ్మంలో రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల మహాసభలకు హాజరైన నాయకులు, ప్రతినిధులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

- త్వరలోనే అర్హులందరికీ ఇళ్లస్థలాలు అందిస్తాం
- గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల సంక్షేమంపై నిర్లక్ష్యం
- రాష్ట్ర సమాచార, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- జర్నలిస్టు సంక్షేమం మరిచిన గత ప్రభుత్వం : మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి
- ఘనంగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ)రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- పలు రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు

4

ఫలించిన పంతుళ్ల కల

- 9 ఏళ్ల తరువాత దక్కిన పదోన్నతులు
- తెల్లవారుజామున ఆన్‌లైన్‌లో ఆర్డర్లు
- విధుల్లోకి చేరేందుకు పరుగులు



బోనకల్, జూన్ 19: ఉపాధ్యాయ లోకంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఎన్నాళ్లుగానో తీరని కలగా వున్న ప్రమోషన్లు దరికి రావడంతో ఉపాధ్యాయులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. పదోన్నతుల ప్రక్రియల భాగంగా సీనియార్టీ ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తూ బుధవారం తెల్లవారుజామునే ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పెట్టడంతో 9 ఏళ్ల తరువాత ఉపాధ్యాయుల కల నేరవేరినట్లయింది. ఆర్డర్లు పొందిన వెంటనే విధుల్లో చేరేందుకు ఉపాధ్యాయులు పాఠశాలలకు పరుగులు తీశారు. జిల్లా వ్యాప్తంగా 1049 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు వచ్చాయి. బోనకల్ మండలంలో 40 మంది పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. అన్ని క్యాటగిరిలలో ప్రమోషన్ల ప్రక్రియ పూర్తైతే బదిలీలకు ఎలాంటి అడ్డంకి లేదు. రెండు రోజుల్లో బదిలీల ప్రక్రియ కూడ పూర్తయ్యే అవకాశం ఉండటంతో ఉపాధ్యాయుల్లో సంతోషం నెలకొంది.

ఒకే క్యాడర్‌లో రెండు, మూడు దశాబ్దాలుగా పని చేసినా ప్రమోషన్లు రాక ఎస్‌జీటీ ఉపాధ్యాయులు నిరాశా, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇక ప్రమోషన్ రావడం కలేనని ఎస్‌జీటీగానే ఉద్యోగ విరమణ పొందాల్సి వస్తుందన్న భావనలో ఉన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సాధన లేక పోవడంతో పాటు న్యాయస్థానాల్లో వందల కేసులు ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగింపుకు అడ్డంకిగా మారాయి. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను సక్రమంగా నడిపించ లేకపోయిందన్న అపవాదును మూటకట్టుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోకి వచ్చాక ఉపాధ్యాయ సంఘాల నాయకులు మరోసారి ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని గత ప్రభుత్వం చేపట్టలేక పోయిందన్న విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పదోన్నతుల ప్రక్రియను వెంటనే చెపట్టాలని ఆదేశాలు ఇవ్వడంతో విద్యాశాఖా కార్యదర్శి కమీషనర్లు ప్రత్యేకంగా దృష్టి సారించారు. టెట్ ఉన్నవారికే పదోన్నతులు ఇవ్వాలని కోర్టులో కేసు నడుస్తుండటంతో ప్రమోషన్ల ప్రక్రియ పై సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో ఎట్టకేలకు పదోన్నతుల ఉత్వర్వులు రావడంతో ఆనందం నెలకొంది.

భద్రాద్రి రామాలయంలో బ్రేక్ దర్శనం

- జూలై 2 నుంచి అధికారికంగా అమలు

భద్రాచలం, జూన్ 19: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు దేవస్థానం బ్రేక్ దర్శనం సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఈ సౌకర్యం జూలై రెండు నుంచి అధికారికంగా అమలు చేయనున్నట్లు భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ప్రతి రోజు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనాలతో పాటు నూతనంగా బ్రేక్ దర్శన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఈ బ్రేక్ దర్శనానికి వెళ్లాలనుకునే వారు రూ.200లతో టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. బ్రేక్ దర్శనం సమయంలో ఉచిత, ప్రత్యేక దర్శనాలు, అంతరాలయ అర్చనలు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. కావున భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఇదిలా ఉండగా విశేష ఉత్సవాల సమయంలో బ్రేక్ దర్శనం వాయిదా వేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా ఈ నెల 22న జేష్ఠ పౌర్ణిమ రోజున శ్రీ సీతారామచంద్రస్వామికి జేష్టాభిషేక మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారికి జేష్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని 22న నిత్యకల్యాణానికి విరామం ఇస్తారని తెలిపారు.

విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



- ప్రజలు స్వేచ్ఛగా ప్రభుత్వ కార్యాలయాలకు రావాలి
- ధరణి సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు
- జిల్లా పాలనలో నాదైన మార్క్ చూపిస్తా
- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజాపాలనలో విద్య, వైద్యం, వ్యవసాయమే తన ప్రాధాన్యతలని ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రేమతో రావాలే తప్ప భయంతో కాదన్నారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ముజమ్మిల్‌ఖాన్ తొలుత వికారాబాద్‌లో శిక్షణ కలెక్టర్‌గా విధుల్లో చేరి అనంతరం సిద్దిపేట జేసీగా, పెద్దపల్లి కలెక్టర్‌గా పనిచేసి ఇటీవలే ఖమ్మం కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన తొలిరోజే ఆయన తన పని ప్రారంభించారు. వచ్చీరాగానే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అక్కడ సమస్యలు తెలుసుకొని తన పనితీరు ఎలా ఉండబోతోందో చూపించారు. ఈ నేపథ్యంలో బుధవారం 'ఆంధ్రజ్యోతి' ఆయనతో ముచ్చటించింది. ఈ సందర్భంగా కలెక్టర్‌గా తాను చేపట్టబోయే విధుల గురించి ముజమ్మిల్‌ఖాన్ వివరించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



ప్రశ్న: ఖమ్మం కలెక్టర్‌గా రావడం పట్ల మీ స్పందన ఏంటి ?

జవాబు: ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా వస్తానని నేను ఊహించలేదు. చైతన్యవంతమైన ఈ జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రితో పాటు మరో ఇద్దరు మంత్రులు ఉన్నారు. ఇలాంటి జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. కలెక్టర్‌గా నా స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. ప్రభుత్వస్థాయిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను మంత్రుల ద్వారా త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తా..

ప్ర: ఖమ్మం కలెక్టర్‌గా మీ పాలన ఎలా ఉండబోతోంది ?

జ: జిల్లా పాలనలో నా మార్క్ తప్పక చూపిస్తా.. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు రావాలంటే భయ పడకూడదు. ప్రేమతో రావాలి. అప్పుడే వారి సమస్యలు నిర్భయంగా అధికారులకు చెప్పుకుంటారు. కలెక్టరేట్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు అన్ని కార్యాలయాల్లో ప్రజలకు స్వేచ్ఛా వాతావరణాన్ని కల్పిస్తా.. నాతోపాటు పాటు ప్రతి కిందిస్థాయి అధికారి కూడా వారికోసమే ఉన్నామన్న విషయం ప్రజలకు అవగాహన కలిగేలా చూస్తా..

ప్ర: ప్రధానంగా మీరు దృష్టిసారించబోయే అంశాలు ఏంటి ?

జ: ప్రధానంగా విద్యా, వైద్యం, వ్యవసాయ శాఖలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తా. ఎందుకంటే చదువుకుంటేనే చైతన్యం వస్తుంది. సంపూర్ణ ఆరోగ్యం ఉంటేనే మనిషి ఏదైనా సాధించవచ్చు. అందుకే అటు విద్యాశాఖ, ఇటు వైద్యారోగ్యశాఖపై దృష్టి సారిస్తా.. వీటి తరువాత ముఖ్యమైన వ్యవసాయం రంగంపై దృష్టి సారిస్తా. ప్రభుత్వపరంగా వచ్చే అన్ని సదుపాయాలను రైతులకు అందించాలన్నదే నా భావన. అలాగే మహిళ సంఘాలను బలోపేతం చేస్తాం.

ప్ర: విద్యా, వైద్యం, వ్యవసాయంలో మార్పునకు ఏ చర్యలు చేపడతారు ?

జ: ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాల్లో ఉపాధ్యాయులు, డాక్టర్లు, సిబ్బంది సక్రమంగా విధులకు హాజరయ్యేలా ఆకస్మిక తనిఖీలు చేపడతా.. నూటికి 80శాతం మంది విధుల్లో ఉన్నా మిగిలిన వారి గైర్హాజరుతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మారుతున్న విద్యావిధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, స్పోకెన్ ఇంగ్లీష్ స్కిల్స్ పెంచడం, విద్యార్థులకు కూడా ఆంగ్ల భాషపై పట్టుపెంచడం, సబ్జెక్టుల్లో కూడా మెళువుకులు నేర్పించేలా చర్యలు తీసుకుంటాం. క్రీడలు, ఇతర అంశాలపై కూడా విద్యార్థులకు శిక్షణ కల్పిస్తాం. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన గురించి తల్లిదండ్రులకు అవగాహన కలిపించే కార్యక్రమాలు చేపడతాం. ప్రభుత్వ వైద్యశాలలు, సీహెచ్‌సీలలో డాక్టర్లు, సిబ్బంది సక్రమంగా విధులకు వస్తేనే రోగులకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పేరుగుతుంది. వ్యవసాయ శాఖ పరంగా కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులపై నిఘా పెడుతున్నాం. రైతులు కూడా విధిగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు కొన్నప్పుడు రశీదు తీసుకోవాలి. అలాగే కూరగాయల సాగు పెంచేందుకు ప్రత్యేక గ్రామాలను ఎంపిక చేసి అక్కడ సాగుకు ప్రోత్సహం ఇస్తాం.

ప్ర: భూసమస్యలపై తీసుకునే చర్యలేమిటి ?

జ: జిల్లాలో ధరణిలో ఉన్న సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేపిస్తున్నాం. దాంతో భూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చూస్తాం. భూసమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ధరణితోనే చాలామందికి కొత్త సమస్యలు వచ్చాయి. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తుదారుడికి సాంకేతికంగా భూ వివాదంలో ఏ సమస్య ఉందో తెలిపి సంబంధిత ఆధారాలతో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తాం. తద్వారా భూసమస్యలు పరిష్కారమవుతాయి.

ప్ర: ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఎలా అడ్డుకోబోతున్నారు ?

జ: జిల్లాలో భూ ఆక్రమణల సమస్యలు అధికంగా ఉన్నాయని నా దృష్టికి వచ్చింది. రెవెన్యూ, ఎన్నెస్పీ, దేవాదాయతోపాటు ఇతర ప్రభుత్వ శాఖలు, సంస్థల భూములు అన్యాక్రాంతం కాకుండా సర్వే చేపట్టి సరిహద్దులు ఏర్పాటు చేస్తాం. అలాగే ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా రెవెన్యూ, ఎన్నెస్పీ తదితర శాఖలతో సర్వే రికార్డ్స్ తదితర శాఖలతో సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటాం.

ప్ర: గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యల పరిష్కారానికి మీ కార్యచరణ ఏమిటి ?

జ: జిల్లాలో గ్రీవెన్స్‌ను కేవలం ఖమ్మం కలెక్టరేట్‌లే పరిమితం కాకుండా రొటేషన్ విధానంలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ గ్రీవెన్స్ నిర్వహిస్తాం. ప్రజలనుంచి వచ్చే వినతిపత్రాలను తక్షణం పరిశీలించి సమస్య తీవ్రతను బట్టి ఎన్ని రోజుల్లో పరిష్కారమవుతుందో చెబుతాం. లీగల్ సమస్యలు, ఇతర సమస్యలుంటే ఫిర్యాదుదారులకు అవగాహన కల్పించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఎక్కువగా భూసమస్యలు, కుటుంబ సమస్యలపైనే గ్రీవెన్స్‌లో దరఖాస్తులు వస్తాయి. వీటి విషయంలో ఫిర్యాదుదారులకు కొంత కౌన్సెలింగ్ నిర్వహిస్తాం.



నేడు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు

- జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ మాలతి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 19: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.మాలతి తెలిపారు. జిల్లాలోని 1,618 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 1,840, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1నుంచి19 సంవత్సరాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మింగించనున్నట్లు తెలిపారు. ఈ మాత్రలను భోజనం తర్వాత మింగించాలని తెలిపారు. అనారోగ్యంతో బాధపడే వారికి ఈ మాత్రలను వేయవద్దని సూచించారు. ఈ మాత్రలు మింగించడం వలన పిల్లల్లో శారీరక మానసిక అభివృద్ధి ఉంటుందన్నారు. పిల్లలల్లో రక్తహీనత నుంచి కాపాడుకునే ఆస్కారం ఉంటుందన్నారు. 1 నుంచి రెండేళ్ల చిన్నారులకు అర మాత్ర, 3 నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు ఒక మాత్ర వేయనున్నట్లు ఆమె చెప్పారు. విద్యాశాఖ, శిశుసంక్షేమ, వైద్యఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో పాఠశాలలు కళాశాలలు, అంగన్‌వాడీ కేద్రాలకు వెళ్లని వారికి ఆశాకార్యకర్తలు గుర్తించి వారికి అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు అందించడం జరుగుతుందన్నారు. ఈనెల 27 న మాప్అప్‌డే కార్యక్రమంలో మాత్రలు మింగని వారికి తిరిగి మింగించనున్నట్లు ఆమె తెలిపారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- భద్రాచలంలో వరద కరకట్ట పరిశీలన



విస్తా కాంప్లెక్సు వద్ద స్లూయిస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

భద్రాచలం, జూన్ 19: గోదావరి వరదల వలన ముంపుకు గురయ్యే మండలాలు, గ్రామాలను వరదల తాకిడికి ఎంత మేరకు ఉంటుందో అంచనా వేసుకొని సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రాచలంలో గోదావరి వరదలు వచ్చే ప్రదేశాలను ఆయన పరిశీలించారు. విస్తా కాంప్లెక్సులోని వరదలకు సంబంధించిన పంపింగ్ మోటార్లను, వరద ఎక్కువైనప్పుడు గోదావరిలోకి వదిలే కనెక్షన్ సంబంధించిన పరికరాలను పరిశీలించారు. అనంతరం కూనవరం రోడ్డులో నిర్మించే కరకట్ట ప్రదేశాలను వరద ముంపుకు గురయ్యే కొత్త కాలనీలను పరిశీలించారు.

గోదావరి వరద పెరిగిన కొద్దీ సీడబ్ల్యూసీ అధికారులు గంటకు ఒకసారి లెవల్ చూస్తూ ఉండాలని, వరద పెరిగే కొద్ది ప్రత్యేకమైన మోటార్లు అమర్చి వాటి ద్వారా గోదావరిలోకి నీటిని వదిలి వేస్తూ ఉండాలని, అవసరమైతే మోటార్లు అదనంగా ఉంచుకోవాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు సీడబ్ల్యూసీ అధికారులు ఏ మాత్రం అజాగ్రత్త చేసినా జరగవలసిన నష్టం జరిగిపోతుందని, అందుకు ముందుగానే ప్రమాదాన్ని పసిగట్టి అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

గిరిజన గ్రామాలు వరద తాకిడికి గురికాకుండా ప్రత్యేక చర్యలతో పాటు శాశ్వత పరిష్కారం చేపట్టాలని, అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వరద తాకిడికి గురయ్యే గ్రామాల ప్రలకు, పశువులకు ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పీ పరితోష్ పంకజ్, ఆర్డీవో దామోదర్‌రావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, డీఈ వెంకటేశ్వరరావు, డీపీవో సుదీర్, తహసీల్దారు శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నెరవేరనున్న కల

- మధిరలో ఎట్టకేలకు అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ
- రూ.128 కోట్ల నిధుల మంజూరు
- అండర్ గ్రౌండ్ పైప్‌లైన్.. 4 మురుగునీరు శుద్ధి ప్లాంట్లు...
- జూలై 1 నుంచి 10 వరకు ప్రజాభిప్రాయ సేకరణ
- హామీ నిలుపుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

వివరాలు : 5లో

పట్టుతప్పిన ప్రగతిచక్రం

- నిర్వహణ లోపాలతో కునారిల్లుతున్న ఆర్టీసీ
- ఇరు జిల్లాల్లో మూతపడ్డ పలు బస్టాండ్‌లు
- పర్యవేక్షణ లేక మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నవైనం
- పలుచోట్ల అన్యాక్రాంతమవుతున్న స్థలాలు



ఖమ్మంలో కేక్ కట్ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఘనంగా రాహుల్‌గాంధీ బర్త్‌డే

- డీసీసీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన మంత్రి పొంగులేటి

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 19: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొని కేక్ కట్ చేసి డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్లకు తినిపించారు. భారత్ జోడో యాత్ర ద్వారా అన్ని వర్గాల ప్రజల కష్ట సుఖాలను స్వయంగా రాహుల్‌గాంధీ తెలుసుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జావీద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ముజాహిద్ హుస్సైన్, కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, రాపర్తి శరత్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు కొత్తగూడెం యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు మాట్లాడారు. దేశాన్ని సంఘుటితం చేయడానికి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసిన గొప్ప నాయకుడు రాహుల్ అని కొనియాడారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

- త్వరలోనే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తాం
- గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల సంక్షేమంపై నిర్లక్ష్యం
- రాష్ట్ర సమాచార, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఘనంగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ)రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- పలు రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 19: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మూడవ మహాసభలు మంగళవారం ఖమ్మం బైపాస్ రోడ్‌లోని ఉషహరి కన్వెన్షన్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి , టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నగునూరి శేఖర్, కె. విరాహత్ అలీ తదితర ఐజేయూ జాతీయ నేతలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభలను ప్రారంభించారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు వారి ఇతర అన్ని సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ప్రకటించారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, మళ్లీ ఇప్పుడు ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా జర్నలిస్టులకు న్యాయం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్లు, హెల్త్‌కార్డుల వంటి సమస్యల పరిష్కారం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని తెలిపారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి హైదరాబాద్ జర్నలిస్టుల స్థలాల విషయంలో ఏర్పడిన సమస్య విషయమై అతి కొద్దిరోజుల్లో చర్చించి పరిష్కరించటంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మిగతా జిల్లాల్లోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఇప్పటికే అక్రిడేషన్లు, మూడు నెలలపాటు పొడిగించిన విషయమై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ తరువాత తన సొంత జిల్లా అయిన ఖమ్మం జర్నలిస్టులకు ముందుగా ఇళ్ల స్థలాలు దక్కేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఖమ్మంలో స్థలం కేటాయింపులో ఏర్పడిన సమస్యను పరిష్కరించే క్రమంలో ప్రత్యామ్నాయ స్థలం పరిశీలించాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు సూచించానన్నారు. ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభలో సైతం తియ్యటి మాటలు చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల కేటాయింపు హామీ నెరవేర్చలేదన్నారు.

మహాసభల్లో పాల్గొనేందుకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ, రాష్ట్ర కమిటీల ప్రతినిధులు, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన



సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఐజేయూ ప్రతినిధులు డెలిగేట్లుగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధజిల్లాల నుంచి భారీసంఖ్యలో జర్నలిస్టులు తరలివచ్చారు. సభలో ఐజేయూ సెక్రటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్ము, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎంఏమాజిద్, కార్యదర్శులు వై. నరేందర్ రెడ్డి, డి. సోమసుందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, ఆలపాటి సురేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. రాంనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా నేడు జరగనున్న ముగింపు సమావేశాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కానున్నారు.

జర్నలిస్టు సంక్షేమం మరిచారు..

● మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి



ప్రస్తుత ప్రభుత్వంలో సమాచారశాఖకు మంత్రిని నియమించటం, ఆ మంత్రి జర్నలిస్టుల రాష్ట్ర మహాసభలకు రావడంతో ఈ సభకు నిండుదనం వచ్చిందని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం సమాచార శాఖను నిర్వీర్యం చేసిందన్నారు. అప్పటి ప్రభుత్వంలో సమాచార శాఖకు మంత్రి లేకపోవడంతో జర్నలిస్టులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యారన్నారు. మీడియా అకాడమీకి గత ప్రభుత్వం రూ.100కోట్లు కేటాయించిందనడం అవాస్తవమన్నారు. ఇకనైనా అలాంటి ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. జర్నలిస్టులకు దక్కాల్సిన ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్లు, హెల్త్‌కార్డులు, పింఛన్ల సాధనకు గట్టిగా పోరాడతామన్నారు. జర్నలిజం పట్ల ప్రజల్లో విశ్వాసం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వృత్తి నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలన్నారు.

జర్నలిస్టు చట్టాలను, హక్కులను నీరుగార్చారు..

● ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్



కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో పలు జర్నలిస్టు చట్టాలను రద్దు చేసి వర్కింగ్ జర్నలిస్టుల హక్కులను నీరుగార్చిందని ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్ విమర్శించారు. గతంలో కేంద్రంలో మంచిబలంతో ఉన్న ప్రభుత్వం జర్నలిస్టులకు, జర్నలిస్టు ఉద్యమాలకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. తాజాగా కేంద్రంలో మోదీ ప్రభుత్వమే ఏర్పాటైనా ఈసారి అంతబలంగా లేదన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు తమ హక్కుల సాధనకు మరోసారి పోరాటాలకు దిగాలన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం..

● ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి పోరాడే జర్నలిస్టులకు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ అండగా ఉంటుందని ఇల్లెందు ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తెలిపారు. మహాసభల్లో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మీడియా మూడో కన్నుగా ఎప్పటికప్పుడు పహారా కాస్తోందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటూ వార్తలను చేరవేస్తున్నారని తెలిపారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కావాలి

● ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కావాలని ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు తెలిపారు. మహాసభల సందర్భంగా ఏర్పాటు కాబోయే నూతన కమిటీ ఆ విషయమై చొరవ చూపుతుందన్న నమ్మకం ఉందన్నారు. మహాసభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపి కృషి చేశారని, ఏకారణంతోనో ఇళ్ల స్థలాల పంపిణీలో ఆటంకం ఏర్పడిందన్నారు.

ఆశించిన న్యాయం జరగలేదు...

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్



గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు ఆశించిన న్యాయం జరగలేదని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించిన జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు, తదితర సమస్యల విషయంలో ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా వాటిలో ఒకటిరెండు మినహా ప్రధానమైనవి ఏమీ నెరవేరలేదన్నారు. ఎన్నోసార్లు అప్పటి సీఎంను కలిసి వినతిపత్రం ఇద్దామని భావించినా కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సమాచార శాఖను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు.

హక్కులు సాధించటం టీయూడబ్ల్యూజే నైజం

● టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విరాహత్ ఆలీ



జర్నలిస్టుల హక్కులను సాధించిన చరిత్ర టీయూడబ్ల్యూజేకే సొంతమని, ఈ సంఘం నైజమే జర్నలిస్టుల సంక్షేమమని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విరాహత్ ఆలీ తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే వారసత్వంగా ఉద్భవించిన సంఘం 65 ఏళ్లలో అనేక పోరాటాలు చేసిన చరిత్ర కలిగి ఉందన్నారు. ప్రభుత్వాలతో రాజీ పడకుండా ఎప్పటికప్పుడు ఉద్యమిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందన్నారు.

రైతులకు కేంద్రం

పెట్టుబడి సాయం

- పీఎం కిసాన్ నిధులు విడుదల
- జిల్లాలో 1,65,000 మంది రైతులకు లబ్ధి

ఖమ్మం వ్యవసాయం, జూన్ 19: కేంద్రం రైతులకు పెట్టుబడి సాయం అందేస్తున్నది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా తీసుకొచ్చిన 'పీఎం కిసాన్' నిధులను ప్రధాని మోదీ విడుదల చేశారు. ప్రతి నాలుగు నెలలకు రూ.2 వేలు చొప్పున ఏడాదికి రూ.6 వేలు జమ చేస్తున్న కేంద్రం.. ఈసారి 17వ విడత నిధుల్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకం ద్వారా ఖమ్మం జిల్లాలో 1,65,000 మంది రైతులకురూ.2 వేలు చొప్పున రూ.460 కోట్లకు పైగా సహాయం అందనుంది. పీఎం కిసాన్ నిధులు ఖాతాలో జమకాకపోతే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. లేకపోతే హెల్ప్‌లైన్ నంబర్ 155261, 1800115526లను సంప్రదించవచ్చు.

పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు ప్రతి సంవత్సరం రూ. 6వేలను చెల్లిస్తుంది. జిల్లాకు రూ. 460కోట్ల లబ్ధి జరుగనుంది. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019లో మొదటిసారిగా ప్రారంభించారు. అరు లైన ప్రతి రైతు వారి బ్యాంకు ఖాతాలో సంవత్సరానికి మూడు సార్లు రూ. 2000 సహాయం పొందవచ్చు.

భద్రాద్రిలో రామయ్య గోత్ర ప్రవరలపై

ముగిసిన అభిప్రాయ సేకరణ

భద్రాచలం, జూన్ 19: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణంలో రామయ్య గోత్రప్రవరల వివాదంపై హైకోర్టు ఉత్తర్వుల మేరకు నియమించిన కమిటీ సభ్యులు భద్రాచలంలో చేపట్టిన అభిప్రాయ సేకరణ ముగిసింది. గత రెండు రోజులుగా హైదరాబాద్ నుంచి వచ్చిన ఐదుగురు కమిటీ సభ్యులు దేవస్థానం వైదిక సిబ్బంది, విశ్రాంత వైదిక సిబ్బంది నుంచి అభిప్రాయాలను సేకరించారు. అలాగే పట్టణంలో దశాబ్దాల కాలంగా ఉన్న సత్రాలు, ఆధ్యాత్మిక సంస్థల నిర్వాహకుల నుంచి సైతం అభిప్రాయ సేకరణ చేశారు.

అదేవిధంగా రామాలయంలో స్వామివారికి నిర్వహించే నిత్యకల్యాణాన్ని వారు స్వయంగా వీక్షించారు. ఇందుకు సంబంధించి కల్యాణ ప్రక్రియ పూర్తి వీడియోను వారు రికార్డు చేయించారు. ఈ సమయంలో పలువురి అభిప్రాయాలను సైతం మౌఖికంగా సేకరించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల పాటు అభిప్రాయసేకరణ నిర్వహించిన అనంతరం వారు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయారు.

ప్రాణాలు తీసిన ఫ్లెక్సీ

- రియల్ ఎస్టేట్ కార్యాలయం తరలింపులో విద్యుత్ ప్రమాదం
- వ్యక్తి మృతి, మరో వ్యక్తికి గాయాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 19: రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రచారానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తికి గాయాలైన సంఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకొంది. స్థానికుల కథనం మేరకు.. ఖమ్మం నగరంలోని జయనగర్ కాలనీ ప్రధాన రహదారిలో ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయం ఏర్పాటు చేసి ప్రచారం కోసం పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

అయితే బుధవారం రియల్ ఎస్టేట్ కార్యాలయం మరో ప్రాంతానికి తరలింపు సందర్భంగా కార్యాలయానికి ఉన్న ఫ్లెక్సీలను తరలించేందుకు ఇద్దరు కూలీలు ఫ్లెక్సీని తొలగించారు. ఈ క్రమంలో ఫ్లెక్సీని తరలించే సమయంలో ఫ్లెక్సీ భారీగా ఉండటంతో ఫ్లెక్సీకి 15అడుగుల దూరంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో ఫ్లెక్సీని పట్టుకొని ఉన్న మాడుగు రవి (36) విద్యుత్ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే మృతి చెందగా, మరో కూలీకి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు..

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

● ఖమ్మం 1టౌన్ ఎక్సైజ్ సీఐ కృష్ణ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 19: గంజాయిను అక్రమంగా రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం 1టౌన్ ఎక్సైజ్ సీఐ కృష్ణ హెచ్చరించారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని వైఎస్‌ఆర్ నగర్ సాగర్ కాల్వ వద్ద రహస్యంగా గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 350 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం నిందితులను ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలించి వారిపై ఎన్‌డీపీఎస్ యాక్టు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఎస్‌ఐ జయశ్రీ, కే సాయిబాబా, సిబ్బంది రామారావు, శశికాంత్, రమేష్, నాగేశ్వరరావు, రాము పాల్గొన్నారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మహిళను వేధించిన కేసులో నిందితుడికి 6 నెలల జైలు

ఖమ్మం లీగల్ జూన్ 19: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురం గ్రామానికి చెందిన సయ్యద్ వజీర్‌కి మహిళను వేధించిన కేసులో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు మూడు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మూడవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి వినుకొండ మాధవి బుధవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది కథనం ప్రకారం.. నిందితుడు రోజు తనను వేధిస్తున్నాడని భర్తకు, తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పెద్దల మనుషుల వద్ద పంచాయతీ చేసి మరోకసారి ఇలాచేయవద్దని చెప్పినారు. అయినప్పటికీ నిందితుడు 2018 డిసెంబరు 22న రాత్రి ఇంట్లోకి వచ్చి అసభ్యకరంగా మాట్లాడాడని, కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్‌చేశారు.

అట్టికేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రాహుల్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ పి.ప్రసాద్, కోర్టు లైజనింగ్ అధికారి కె.మోహన్‌రావు లు సహకరించారు.

గ్రాండ్ టెస్ట్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 19: టీజీపీఎస్సీ గ్రూప్ 2 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అభ్యర్థులకు ఉచిత గ్రాండ్ టెస్ట్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. జూలై 8 నుంచి 31వ తేది వరకు మొత్తం నాలుగు గ్రాండ్ టెస్ట్‌ల్లో 12 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టెస్ట్‌లు ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్ట్‌లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 8, 9న మొదటి గ్రాండ్ టెస్ట్, 15, 16 తేదీలలో రెండవ గ్రాండ్ టెస్ట్, 22, 23 తేదీలలో మూడవ గ్రాండ్ టెస్ట్, 30, 31 వ తేదీలలో నాల్గోవ గ్రాండ్ టెస్ట్ నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9573859598, 9059793456, 9652161850 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్‌ఎం



ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 19: ఉమ్మ డి ఖమ్మం జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌గా అజ్మీరా సరిరాం బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లాలో డీవీఎంగా బా ధ్యతలు నిర్వహిస్తున్న సరిరాంను పదోన్న తిపై ఖమ్మం రీజనల్ మేనేజర్‌గా నియమించారు. గతంలో 2011జూన్ నుంచి 2012 జూన్ 8 వరకు సరిరాం ఖమ్మంలో డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్‌గా పని చేశారు. ప్రస్తుతం ఖమ్మం ఆర్‌ఎంగా ఉన్న సీహెచ్ వెంకన్నను హైద్రాబాద్ ప్రధాన కార్యాలయంలో చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. బుధవారం ఆర్‌ఎం వెంకన్నను ఆర్టీసీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అయన ఈ 11నెలల్లో ఆర్టీసీ అభివృద్ధికి, ఉద్యోగులు ఉన్నతికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రీజనల్ పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగులు, డీఎంలు పాల్గొ న్నారు. అనంతరం నూతన ఆర్‌ఎం సరిరాం మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ అభి వృద్ధికి, ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ముందు ప్రాధాన్యత ఉంటుం దన్నారు. ఆర్‌ఎంకు సంస్థ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌సీసీ క్యాంపును సందర్శించిన..

ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఎయిర్ కమాండర్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎయిర్ కమాండర్

కూసుమంచి, జూన్ 19: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంపును ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా డీజీ గార్డును తనిఖీ చేశారు. క్యాడెట్‌లు, ఏఎన్‌వో, పీఐ సిబ్బందితో ఇంట్రాక్ట్ చేశారు. రానున్న టీఎస్‌సీ క్యాంపులో మంచితీరు కనబర్చుకోవాలని ఆకాంక్షించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ మహబూబాబాద్ జిల్లాల నుంచి సుమారు 560 మంది క్యాడెట్లు ఈ శిబిరానికి హాజరయ్యారు. వారికి ఫైరింగ్, డ్రిల్, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ ఇవ్వనుండగా ఈ నెల 28వరకు క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కల్నల్ సచిన్ నింబాల్కర్, వరంగల్ ఎన్‌సీసీ క్యాడర్ జీపీ కల్నల్ సంజయ్ గుప్తా, తదితరులు ఉన్నారు.



మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ పాటిల్

భద్రాచలం, జూన్ 19: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీవో జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం భద్రాచలంలో గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేసి మెనూ ప్రకారం ప్రతి రోజు భోజనం పెడుతున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులకు ఇండ్లకు వెళ్లి తిరిగి పాఠశాలల్లో చేరిన విద్యార్థినుల పట్ల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు వారి ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉండాలని, వాతావరణం, స్థలం మార్పు వలన పిల్లల ఆరోగ్యంలో మార్పులు సంభవిస్తాయని గమనిస్తూ ఉండాలని, ఎవరైనా పిల్లలు అస్వస్థతకు గురైతే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్‌రావు, డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో నరసింహారావు, పాఠశాల హెచ్‌ఎం సుభద్ర, తహసీల్దారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో భోజనం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన వ్యవసాయ విద్యార్థులు

అశ్వారావుపేట, జూన్ 19: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు బుధవారం క్షేత్ర సందర్శనలో భాగంగా అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని, అశ్వారావుపేటలోని పలు పామాయిల్ క్షేత్రాలను సందర్శించారు. పామాయిల్ కర్మాగారం పనిచేసే విధానం గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ విద్యార్థులకు పామాయిల్ తోటలు, యాజమాన్య పద్ధతులు, దిగుబడులు, నర్సరీ పెంపకం, మార్కెటింగ్, రాయితీలు, కర్మాగారంలో ఆయిల్ రికవరీ విధానం గురించి వివరించారు. ఈ సందర్భంగ కళాశాల అసోసియేట్ డీన్ మాట్లాడుతూ విద్యార్థులకు నాలుగు గోడల మధ్య చదువులకన్నా క్షేత్రస్థాయిలో పరిశీలన ఎంతో ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.



ఫ్యాక్టరీలో విద్యార్థులు

28నుంచి జాతీయ నాటకోత్సవాలు

పాల్వంచ టౌన్, జూన్ 19: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో జాతీయ స్థాయి నాటకోత్సవాలు, తెలంగాణ ధూంధాం కార్యక్రమాలు పాకాలపాటి కృష్ణయ్య సాంస్కృతిక కళాపీఠం తెలంగాణ పాల్వంచ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పాకాలపాటి కృష్ణయ్య సాంస్కృతిక కళాపీఠం అధ్యక్షుడు పాకాలపాటి రోశయ్య చౌదరి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్ర అవార్డు 2024 పేరిట పౌరాణిక, జానపద, చారిత్రాత్మక, సాంఘీక ఏకాంకిక నాటకములు, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలో పాల్గొన దల్చిన వారు ఏకాంకిక నాటక అంశం, పాత్రదారుల పేర్లు, మొబైల్ నెంబరు తదితర వివరాలతో రూ. 250లు ఎంట్రీ ఫీజుతో ఈ నెల 25లోపు పాకాలపాటి రోశయ్యచౌదరి, ఇంటి నెంబర్ 10-1-49 చాకలిబజారు న్యూ పాల్వంచ అడ్రస్‌కు పంపించాలని కోరారు. పౌరాణిక, జానపాద, చారిత్రక, సాంఘీకపరమైన వాటి ప్రదర్శన ఇచ్చే పోటీదారులు రూ. 400లు ఎంట్రీ ఫీజుతోపై అడ్రస్‌కు ఈ నెల 25లోపు దరఖాస్తులు పంపాలని సూచించారు. పోటీలో పాల్గొను వారికి మేకప్, హార్మోనిస్టు, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో రంగస్థల నటులు కొండం వెంకన్న, సాదం రామకృష్ణ, శ్రీపాత సత్యనారాయణ, కాపర్తి వెంకటాచారి, పి. రాంమోహన్ రెడ్డి, ఎస్‌కే. బాషా, ఎస్‌కే. ఖాసీం, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోశయ్య చౌదరి

ఉద్యాన రాయితీ నిధులు విడుదల: ఉద్యాన అధికారి

ఖమ్మం వ్యవసాయం, జూన్ 19: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి, పట్టుదలతో ఖమ్మం జిల్లా ఉద్యాన, ఆయిల్‌పామ్ రైతులకు రావాల్సిన నిర్వహణ, అంతర పంట రాయితీని, బిందు సేద్య పరికరాల రాయితీని ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా ఉద్యానఅధికారి బీవీ రమణ బుధవారం తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయిల్‌పామ్ తోటలకు గాను 2483మంది రైతులకు 1056.80 ఎకరాలకు రూ. 3కోట్ల 72లక్షలు, బిందు సేద్య పరికరాలు రాయితీకి గాను 159 మంది రైతులకు 725 ఎకరాలకు రూ.45 లక్షల94వేల రూపాయలు వారి ఖాతాలలో రెండు మూడు రోజుల్లో జమ చేస్తామని తెలిపారు. బిందు సేద్య పరికరాలకు సంబంధించిన రాయితీని డ్రిప్ కంపెనీలకు జమ చేస్తామని తెలిపారు.

రామాలయం, అన్నదాన సత్రానికి..

సోలార్ విద్యుత్తు



భద్రాచలం, జూన్ 19: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి, దేవస్థానం ఉ చిత నిత్యన్నదాన సత్రానికి సోలార్ విద్యుత్తు సౌకర్యం అందుబాటులోకి తెచ్చారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. భద్రాద్రి రామాలయంకు, అన్నదానసత్రంకు 90 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్తును ఇక నుంచి అందుబాటులోకి రావడం జరిగింది. దీంతో దేవస్థానానికి విద్యుత్తు బిల్లులు ఆదా కానున్నాయి.


ఉత్సవమూర్తులకు అభిషేకం

భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు బుధవారం అభిషేకం నిర్వహించారు. ప్రతి బుధవారం స్వామి వారి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించడం సంప్రదాయం. అందులో భాగంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం సీతారామచంద్రస్వామికి నిత్యకల్యాణ మండపంలో భక్తి ప్రపత్తులతో కల్యాణం నిర్వహించారు. అంతకు ముందు సహస్రనామార్చన నిర్వహించారు.

సీఎంతో కూనంనేని భేటీ

నియోజకవర్గ సమస్యలపై సుదీర్ఘచర్చ

మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్



కొత్తగూడెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. సచివాలయంలో గంటపాటు జరిగిన చర్చల్లో కొత్తగూడెం నియోజకవర్గానికి సంబంధించిన ప్రధాన సమస్యలను కూనంనేని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాను ప్రతిపాదించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచను కలుపుతూ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని కూనంనేని ప్రతిపాదనను ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను త్వరలో చేపడతామని సీఎం తెలిపినట్లు తెలిపారు. కేటీపీఎస్ తొలగించబడిన ఎబీసీ విద్యుత్‌స్టేషన్ల స్థలంలో 800మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా రైతాంగ సాగునీరు అవసరాలు తీర్చేందుకు సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారని, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రెవిన్యూ సమస్యలు పరిష్కరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధానంగా పాల్వంచలోని 444, 817, 999, 727 తదితర సర్వే నెంబర్లలో నెలకొన్న రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని సీఎం హామీ ఇచ్చారని, పాల్వంచ, కొత్తగూడె బైపాస్ రోడ్డు, నియోజకవర్గంలో ప్రధాన రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యతను ఇస్తూ నిధులు మంజూరు చేయిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెం జిల్లా ప్రధాన ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా మరో పది డయాలసిస్ యంత్రాల ఏర్పాటుకు అ దేవిధంగా కొత్తగూడెం పట్టణ ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ జీవో 76ను పునరుద్ధరించి త్వరితగతిన యజమానులకు పట్టాలు జారీ అయ్యే విధంగా ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారని కూనంనేని తెలిపారు. ఇప్పటికే వివిధ పథకాల కింద సుమారురూ. 12కోట్ల వ్యయంతో అంతర్గత రోడ్లు, డ్రైన్లు పూర్తి కావస్తుండగా ఇటీవలే పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదు యూనిట్లతో కూడిన డయాలసిస్ కేంద్రాన్ని కూనంనేని సాధించారు. గెలిచిన ఆరు నెలల్లోనే నియోజకవర్గ ప్రజలకు గెలుపు ఫలాలు అందుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కరామత్ అలీ



కొణిజర్ల, జూన్19: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న కరామత్ అలీని బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు పని చేసిన వేముల మాధవరావు ఉద్యోగ విరమణ పొందడంతో కరామత్ అలీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై శక్తివంచన లేకుండా పోరాడతామన్నారు. ఎస్టీయు బాధ్యులు జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వరప్రసాద్, దొడ్డా వెంకటేశ్వరరావు, నరసింహరావు, సైదా, పుల్లాచారి, జానికీరాణి, పద్మావతి, విజయశీల, అల్తాఫ్, నాగమణి, సమత, సంధ్య అలీని అభినందించారు.

నేడు, రేపు గిరిజన సంఘం రాష్ట్ర శిక్షణ తరగతులు

వైరా, జూన్ 19: ఖమ్మం జిల్లా వైరాలో గురు, శుక్రవారాల్లో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు జరుగుతాయని ఆసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరా శాంతినగర్‌లోని పర్చూరి గార్డెన్స్‌లో ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలో గిరిజనులు అత్యధికంగా ఉన్న జిల్లా కేంద్రాల్లో ఐటీడీఏలను సాధించటమే లక్ష్యంగా భవిష్యత్ పోరాటాల రూపకల్పనకు శిక్షణ తరగతులను వేదికగా చేస్తామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారని ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

సికెల్ సెల్ కార్యక్రమంపై అవగాహన పెంచుకోవాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 19: సికెల్‌సెల్ కార్యక్రమంపై అవగాహన కల్పించుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మాలతి కోరారు. బుధవారం ఖమ్మం మెడికల్ కళాశాలలో నిర్వహించిన నేషనల్ సికెల్ సెల్ అనేమియా ఎలిమినేషన్ మిషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థినులకు సికెల్ సెల్ కార్యక్రమంపై అవగాహన, స్క్రీనింగ్ చేశారు. అనంతరం 106 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ చేశారు ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయలక్ష్మి, ఐ.ఎం.ఏ. అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి

పట్టుతప్పిన ప్రగతిచక్రం


నిరుపయోగంగా ఉన్న నేలకొండపల్లి బస్టాండ్

- నిర్వహణ లోపాలతో కునారిల్లుతున్న ఆర్టీసీ
- ఇరు జిల్లాల్లో మూతపడ్డ పలు బస్టాండ్‌లు
- మందుబాబులకు అడ్డాలుగా మారుతున్న వైనం
- పలుచోట్ల అన్యాక్రాంతమవుతున్న స్థలాలు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 19: ప్రజారవాణా వ్యవస్థకు పెద్దదిక్కుగా ఉన్న ఆర్టీసీ సంస్థ పరిస్థితి 'పేరుగొప్ప ఊరుదిబ్బ' తీరుగా తయారైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్వహణ లోపాలతో అనేక బస్టాండ్‌లు ఇప్పటికే మూతపడగా, సంస్థ ఆయా స్థలాలను కూడా కాపాడుకోలేకపోతోంది. ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి సంబంధించిన అనేక ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. చివరికి దాతలు ఇచ్చిన భూములను


నిరుపయోగంగా ఉన్న ఎర్రుపాలెం బస్టాండ్

సైతం సంస్థ కాపాడుకోలేకపోతోంది. ఇరు జిల్లాల్లో ఏళ్లక్రితం నిర్మించిన అనేక బస్టాండ్‌లు ఆలనాపాలనా లేక దుమ్ముకొట్టుకుపోతున్నాయి. అనేక బస్టాండ్‌లలోకి బస్సులు రాకపోవడంతో కబ్జాదారుల కన్ను వాటిపై పడుతోంది. ఇక బస్టాండ్‌ల నిర్వహణ విషయంలో ఆర్టీసీ తీరుపై సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

ఇక ఆర్టీసీ బస్టాండ్లలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటోంది. బస్టాండ్ పరిసరాల్లోనే బహిరంగ మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక బస్టాండ్లలో ప్రయాణికులు మూత్రశాలలు వినియోగించుకోవాలంటే రూ.5 వసూలు చేస్తున్నారు. ఇక బస్టాండ్లలోని హోటళ్లు, స్టాల్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయిస్తూ ప్రయాణికులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఇరు జిల్లాలోని అనేక బస్టాండ్‌లు పైకి హంగూ ఆర్భాటాలతో కనిపిస్తున్నా లోపలంతా డొల్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా ఆర్టీసీ ఉన్నతాధికారులు మాత్రం అంతా బాగుందంటూ నివేదికలిస్తున్నారు.

మిగిలిన బస్టాండ్‌లు ఉపయోగంలోకి వస్తాయో రావో తెలియని పరిస్థితి నెలకొంది. ఆయా బస్టాండ్‌లకు సంబంధించిన స్థలాలు కొన్ని అన్యాక్రాంతమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జమలాపురంలో పేరుకే బస్టాండ్ ఉంది. ఏ ఒక్క బస్సూ ఆ బస్టాండ్ లోపలికి వెళ్లదు. ప్రస్తుతం ముళ్ల కంచెలలతో నిండి ఉన్న ఆ బస్టాండ్ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన జమలాపురం ఆలయానికి ఖమ్మం డిపో నుంచి ఒక్క బస్సు సర్వీస్ కుడా అందుబాటులో లేదు. దీంతో ప్రయాణికులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. ఎర్రుపాలెం బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో ఇది మందుబాబులకు అడ్డాగా మారింది.

కారేపల్లి బస్టాండ్ స్థలం...

కారేపల్లి బస్టాండ్ కోసం 20ఏళ్ల క్రితం దాతలు ఇచ్చిన స్థలం ప్రస్తుతం అన్యాక్రాంతమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ స్థలం ఓ వ్యక్తి ఆధీనంలోకి వెళ్లినట్లు సమాచారం. బస్టాండ్ మూతపడడంతో ఇటీవల కొంత మంది ఆ బస్టాండ్‌ను కూల్చివేసి ఆ స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై కొందరు స్థానికులు ఆర్టీసీ అధికారులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. బస్టాండ్ కూల్చివేసిన విషయం ఆర్టీసీ అధికారులకు తెలిసినా డిపో అధికారి పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ బస్టాండ్ స్థలం వివాదంపై ఆర్టీసీ కరీంనగర్ జోన్ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

నిరుపయోగంగా బస్టాండ్‌లు..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఆర్టీసీ రిజియన్ పరిధిలో మొత్తం 30బస్టాండ్లు నిర్మించగా ప్రస్తుతం కేవలం 19బస్టాండ్‌లే ఉపయోగంలో ఉన్నాయి. మిగిలిన 11బస్టాండ్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా బస్టాండలు చెత్త చెదారంలో నిండి మందుబాబులకు అడ్డాలుగా మారాయి. ఖమ్మం డిపో పరిధిలో గార్ల, బోనకల్, కారేపల్లి, నేలకొండపల్లి బస్టాండ్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. మధిర డిపో పరిధిలో జమలాపురం, ఎర్రుపాలెం బస్టాండ్‌లు, సత్తుపల్లి డిపో పరిధిలో దమ్మపేట, భద్రాచలం డిపో పరిధిలో దుమ్ముగుడెం, కొత్తగుడెం డిపో పరిధిలో చంద్రుగొండ, మణుగురు డిపో పరిధిలో ఏడుళ్లబయ్యారం బస్టాండ్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిలో ప్రస్తుతానికి ఒక్క నేలకొండపల్లి బస్టాండ్‌ను మాత్రమే త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నారు.

పాలేరు ప్రజలకు మూడేళ్లలోపే సంక్షేమ పథకాలు

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కూసుమంచి, జూన్ 19: పాలేరు నియోజకవర్గంలోని ఇళ్లు లేని పేదలందరికీ మూడేళ్లలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా జీళ్లచెరువు గ్రామంలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ పాలేరు ప్రజలు తనను అత్యధిక మెజారిటీతో గెలిపించారని, అందుకు సంక్షేమ పథకాలు అందించి రుణం తీర్చుకుంటానని తెలిపారు. అతికొద్దిరోజుల్లోనే కొత్తరేషన్‌కార్డులు, పెన్షన్లు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మహిళా నాయకురాలు స్వర్ణ కుమారి, ఎంపీపీ బాణోతు శ్రీనివాస్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో, కాంగ్రెస్ నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, జూకూరి గోపాలరావు, సుధాకర్‌రెడ్డి, బజ్జూరి వెంకటరెడ్డి, యడవల్లి రాంరెడ్డి, మంకెన వాసు, తదితరులున్నారు..


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంలో అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ

ఖమ్మంకార్పొరేషన్, జూన్19: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ మళ్లీ ప్రారంభమైంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సుమారు రూ.1,200 కోట్ల విలువైన పనుల్లో భారీ అవినీతి జరిగిందంటూ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులందాయి. తొలుత విచారణ చేసి ఇంజనీరింగ్ విభాగానికి సంబధించిన పలు ఫైళ్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరిగి గత నెలలో విచారణకు అధికారులు రాగా, ఎన్నికల కోడ్ ఉందని, కోడ్ ముగిసిన అనంతరం విచారణ చేయాలని అప్పటి కమిషనర్ కోరడంతో విచారణను వాయిదా వేశారు. తాజాగా బుధవారం విజిలెన్స్ అధికారులు తిరిగి విచారణ చేపట్టారు. ఈసారి డివైడర్ల నిర్మాణాలపై దృష్టి సారించారు. ఆమేరకు బుధవారం బోనకల్ రోడ్, ఇల్లెందు రోడ్ తదితర ప్రాంతాల్లో డివైడర్లను విజిలెన్సు అధికారులు తనిఖీ చేశారు. వాటి పొడవు, వెడల్పుతో పాటు నాణ్యతను పరిశీలించారు.

అందుకు సంబంధించిన ఫైళ్లకోసం నగర పాలకసంస్థ కార్యాలయానికి వెళ్లారు. కాగా సదరు డివైడర్ల నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందని, ఒకే కాంట్రాక్టర్‌కు కోట్లాది రూపాయల పనులు అప్పగించారని, ఫిర్యాదులు విజిలెన్సు అధికారులకు అందాయి. దీనిపై నివేదిక తయారు చేయనున్నట్టు తెలిసింది.

డాక్టర్లు బాగా చూస్తున్నారా..?

- రోగులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ముచ్చట్లు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 19: ఏమ్మా.. ఎక్కడి నుంచి వచ్చారు....? ఆరోగ్యం బావుందా....? ఇక్కడ డాక్టర్లు బాగా చూస్తున్నారా...? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా...? అంటూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడారు.. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత బుధవారం ఆయన తొలిసారిగా జిల్లాకు చేరకుని నేరుగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చారు. ఈసందర్భంగా ఓపీ నమోదు విభాగానికి వెళ్లారు. అక్కడ రోగులు కూర్చుని ఉండగా వారికి ఎదురుగా కింద కూర్చొని వారితో సంభాషించారు. ఆరోగ్యం బాగాలేదా.. ఎమయ్యింది... డాక్టరికి చూపించుకున్నారా.. ఏమన్నారు.. మందులు ఇచ్చారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఆ తర్వాత నాయకన్‌గూడెం సమీపంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన రాముతో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రికి ఎందుకు వచ్చావని అడిగారు. దీనికి రాము మా నాన్న ఆస్పత్రిలో ఉన్నాడు అనగానే డాక్టర్లు బాగా చూశారా.. ఎలా ఉంది ఇప్పుడు మీనాన్నకు అంటూ బాగోగులు అడిగారు. ప్రభుత్వ ఆస్పత్రులో వసతులు సౌకర్యాలు బాగున్నాయి.. ఇక్కడికే రండి... మీ ఇంటి పక్కన వారికి ఏమైనా అయినా కూడా ఇక్కడికే పంపించండి అంటూ చెప్పారు. ఆ తర్వాత మీ పిల్లలు ఏం చదువుతున్నారు.. ఎక్కడ చదువుతున్నారని అడిగారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలన్నారు.

ఆ తర్వాత కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా ఆస్పత్రి అధికారులు వైద్యులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వారిని ఆదేశించారు. శస్త్ర చికిత్స విభాగాలు, ప్రసూతి వార్డులలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను స్వయంగా రోగుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ తనిఖీల సందర్భంగా ఆసుపత్రి పర్యవేక్షకులు డా. కిరణ్ కుమార్, ఆర్ఎంవో డా. అమర్ సింగ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఎంసీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ బాబు రత్నాకర్, డాక్టర్. రాంబాబు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

విద్యతోనే సామాజికాభివృద్ధి...

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 19: విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యకు తొలి ప్రాధాన్యతనిస్తామని అన్నారు. విద్యాశాఖలో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశాలపై ఆయన మార్గదర్శనం చేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం పాఠశాలలో అవసరమైన భౌతిక వనరులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. ఇకనుంచి ప్రతిరోజు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును జిల్లా స్థాయి వరకు మానిటర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల నమోదు, నిలకడను పెంచడానికి పిటిఎం (పేరెంట్, టీచర్స్ మీటింగ్) సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఈ. సోమశేఖర్ శర్మ, సీఎంఓ వై. రాజశేఖర్, ఏఎంవో రవికుమార్, కోఆర్డినేటర్లు రామకృష్ణ, భూలక్ష్మి, భానుప్రకాష్, పాపారావు, డీఎస్‌వో జగదీష్, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరనున్న కల..

- మధిరలో ఎట్టకేలకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ
- రూ.128 కోట్ల నిధులు మంజూరు చేయించిన డిప్యూటీ సీఎం భట్టి
- అండర్ గ్రౌండ్ పైప్‌లైన్.. నాలుగు మురుగునీరు శుద్ధి ప్లాంట్లు...
- జూలై 1 నుంచి10 వరకు ప్రజాభిప్రాయ సేకరణ



మధిర టౌన్, జూన్ 19: మధిర పట్టణంలో ఇకపై ముక్కు మునుకొని నడవాల్సిన పనిలేదు... ఎందుకంటే జిల్లాలోనే మొట్ట మొదటి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కలిగిన మునిసిపాలిటీగా మధిర మారనున్నది. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మధిర శాసనసభ్యునిగా 12 సంవత్సరాల క్రితం మధిర మునిసిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారు చేయించి 32 కోట్ల రూపయల నిదులు కూడా మంజూరు చేయించారు. అయితే రాష్ట్ర విభజన, ఆ తరువాత ప్రభుత్వం మారటంతో భట్టి కల నెరవేర కుండానే పోయింది. నాడు డిప్యూటీ స్పీకర్ హోదాలో చేయించలేక పోయిన పనిని నేడు డిప్యూటీ సిఎం హోదాలో రూ.128 కోట్ల నిదులు మంజూరు చేయించి ఇచ్చిన హమీని నెరవేర్చారు.


జీవోకాపీని చూపుతున్న డిప్యూటీ సీఎం భట్టి(ఫైల్)

మధిర పట్టణంతో పాటు విలీన గ్రామాలలో కూడా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారు చేసారు. మధిర పట్టణంతో పాటు విలీన జిలుగుమాడు గ్రామంలోని మురుగునీరు శుద్ధి చేసేందుకు 4ఎంఎల్‌డీ అంటే సుమారు 40 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ ను రాయపట్నం బ్రిడ్జి సమీపంలో నిర్మించనున్నారు. అలాగే మునిసిపాలిటీలో విలీన గ్రామాలైన అంబారుపేట లో 0.4, ఇల్లందలపాడులో 0.5, మడుపల్లి లో 0.9ఎంఎల్‌డి సామర్థ్యం తో మరో మూడు సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించనున్నారు. జీరో డిశ్చార్జ్ తో నిర్మించే ఈ సివరేజి ప్లాంట్ల నుండి వచ్చే నీరు ను వ్యవసాయానికి వాడుకునే విధంగా శుద్ధి చేయనున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంపై జూలై 1నుండి 10 వరకు ప్రభుత్వం ప్రతిపాదించిన నమూనా పై ప్రజల నుండి అభిప్రాయలను తీసుకోనున్నారు, దీనికి అనుగుణంగా జూలై 17న ఫైనల్ డిపిఆర్‌ఓ తయారు చేసి జూలై 24 టెండర్లు పిలవనున్నారు, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టరు రెండు సంవత్సరాల లోపు పనిపూర్తి చేసి అప్పగించేలా గడువు విదించనున్నారు. అన్నీ అనుకున్నట్లు సక్రమంగా జరిగితే మరో రెండు సంవత్సరాల తరువాత మురుగు కాలువ, మురుగు వాసనే లేని మునిసిపాలిటీగా మధిర హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల సరసన నిలవనుంది.

కౌలు రైతులకు పథకాలు వర్తింపజేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు

తల్లాడ, జూన్ 19: షరతులు లేకుండా కౌలు రైతులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు కోరారు. బుధవారం తల్లాడలోని వాసవీ కల్యాణ మండపంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన కౌలు రైతుల రాష్ట్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. కౌలు రైతులకు రైతు భరోసా, రైతు బీమా, పంటల బీమా పథకాలను వర్తింపజేయాలన్నారు. కౌలురైతులకు రుణాలు ఇచ్చి రుణమాఫీ కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా భూయజమానికి కాకుండా కౌలు రైతులకు వర్తింపజేసేందుకు ఒప్పంద పత్రం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన సరైంది కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కౌలు రైతులకు హామీలిచ్చి వాటిని అమలు చేసేందుకు ప్రస్తుతం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం పతాకాన్ని సీనియర్ నాయకుడు తాతా భాస్కర్‌రావు ఆవిష్కరించారు. అనంతరం తల్లాడలో ప్రదర్శన నిర్వహించారు. సభలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బొం తు రాంబాబు, నాయకులు కె.పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, శోభన్ బాబు తదితరులు ప్రసంగించారు.


సదస్సులో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి

తిరుమలాయపాలెం, జూన్19: మండలంలోని మాదిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పట్ల ప్రభాకర్(55) బుధవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రభాకర్‌కు గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వైద్యం కోసం తరలించేందుకు ప్రయత్నించగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు కుమారులున్నారు. కాగా పార్థీవదేహాన్ని మాజీ సర్పంచ్ బోడపట్ల నరసయ్య, సునీత, బేతమల్ల అఖిలప్రేమ్‌సాగర్, దాసులు సందర్శించి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు..

సత్తుపల్లిరూరల్, జూన్19: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందిన సంఘటన సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో యాచించుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ యాచకుడిని స్థానిక వెంగళరావునగర్ సమీపంలో బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో యాచకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

రఘునాథపాలెం, జూన్ 19: రోడ్డు ప్రమాదంలో గాయాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. సీఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం ఖానాపురానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ హనుమంతరావు తన ట్రాక్టర్ ద్వారా మంగళవారం ఖమ్మం నుంచి కామేపల్లి మండలానికి ఇద్దరు కూలీలు చెక్కల శంకర్, పేరబోయిన వెంకటేష్‌లతో ఐరన్ లోడ్‌ను తీసుకేళ్తున్నారు. ఈ క్రమంలో రఘునాథపాలెం మండల కేంద్రానికి సమీపంలో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ ట్రాలీ పై ఉన్న ఇద్దరు కూలీలు రోడ్డుపై పడ్డారు. తీవ్ర గాయాలైన ఇరువురిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో చెక్కల శంకర్(40) బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి ఏడాది జైలు

ఖమ్మం లీగల్ జూన్ 19: చెల్లని చెక్కు కేసులో నిందితుడైన ఖమ్మం నగరం పాండురంగాపురానికి చెందిన షేక్ యాకూబ్‌పాషా(35)కు ఏడాది జైలుశిక్షతోపాటు ఫిర్యాదికి లక్ష యాభై వేల రూపాయలను చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు.. ఖమ్మం నగరం పాండురంగాపురానికి చెందిన ఫిర్యాది కాటిరెడ్డి రామిరెడ్డి వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 2012 మే 10న లక్ష యాభై వేల రూపాయలను అప్పుగా తీసుకొని, అదేరోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చాడు. ఫిర్యాది తన రుణాన్ని తిరిగి చెల్లించమని అడగగా నిందితుడు 2013 మే 29న బ్యాంక్ చెక్కును జారీ చేసినాడు. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమచేయగా నిందితుడి ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీచేసి కోర్టులో నిందితుడిపై ప్రైవేట్ కేసు దాఖలు చేసినాడు. అట్టి కేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

158 కేజీల గంజాయి పట్టివేత

టేకులపల్లి, జూన్ 19: నిషేధిత గంజాయిని కారులో అక్రమంగా తరలిస్తుండగా బుధవారం టేకులపల్లిలో పోలీసులు పట్టుకున్నారు. టేకులపల్లి పోలీసు ఎస్‌ఐ ఎస్‌కే సైదారావూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకట్యాతండా వద్ద బుధవారం ఎస్‌ఐ సైదా రవూఫ్ పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో మారుతీ బ్రెజా కారులో కామారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు పెనుగొండ వెంకటరాజు, బోదాసు తిరుపతిలు గం జాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. కారులో తరలిస్తున్న 79ప్యాకెట్లలో 158కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారు ఒరిస్సా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి ప్రాంతం నుంచి మహారాష్ట్ర షోలాపూర్‌కు తరలిస్తుండగా టేకులపల్లిలో పట్టుకున్నామని తెలిపారు. పట్టుకొన్న గంజాయి విలువ రూ39.50లక్షలు ఉంటుందని తెలిపా రు. కారు, గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్‌ఐ తెలిపారు.


పట్టుబడిన నిందితులు, గంజాయితో పోలీసులు

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● ఖమ్మం డిపో మేనేజర్ బి. శ్రీనివాస్

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 19: కార్గో సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం డిపో మేనేజర్ బి. శ్రీనివాస్ అన్నారు. బుధవారం కార్గో సేవలు ప్రారంభించి నాలుగేళ్లు పూర్తి చేసుకొని, ఐదో ఏడుకు అడుగెడుతున్న సందర్భంగా బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో రావు కేక్ కట్ చేసి వినియోగదారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో కార్గో ఆదాయం రూ.18కోట్ల, 54లక్షలు వచ్చిందని తెలిపారు. వినియోగదారుల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతూ నాలుగు వసంతాలు పూర్తి చేసుకుందని అన్నారు. వినియోగదారుల అవసరాలు నిమిత్తం ఖమ్మం పాత బస్టాండ్‌లో కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా సేవలను విస్తరించనున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే విధంగా టీజీఎస్ ఆర్టీసీ కార్గో సర్వీసును ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌కె. హరి వర్మ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌బి. వీరభద్రం కార్గో సిబ్బంది సీతారామారావు, ఆదాం, అనిత, సరిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్గో ద్వారా వచ్చిన ఆదాయ వివరాలను తెలిపారు.


కేక్ కట్‌చేస్తున్న డీఎం శ్రీనివాసరావు

2022-21 సంవత్సరంలో లక్షా78వేల బుకింగ్స్‌కు గాను రూ.కోటి71లక్షలు, 2021-22వ సంవత్సరంలో 3లక్షల, 23వేల బుకింగ్స్‌కు గాను రూ.3కోట్ల,82లక్షలు, 2022-23లో 3లక్షల,76 బుకింగ్స్ గాను రూ.5కోట్ల, 77లక్షలు, 2023-24లో 4లక్షల నాలుగు బుకింగ్స్‌కు గాను రూ.7కోట్ల24లక్షల ఆదాయం సమకూరిందని డీఎం తెలిపారు. రానున్న రోజుల్లో ఆదాయం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారులకు నమ్మకంతో కూడిన సర్వీస్‌లను టీజీఎస్ ఆర్టీసీ అందిస్తుందని తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప స్వాధీనం

పాల్వంచ, జూన్ 19: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను ఫారెస్టు అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పాల్వంచ మండలం కేశవాపురం గ్రామంలోని రాజు, భద్రుల ఇంట్లో టేకు కలపను అక్రమంగా నిల్వ చేశారని ఫారెస్టు అధికారులకు సమాచారం అందింది. దీంతో రేంజి అధికారి అనిల్ నేతృత్వంలో అటవీశాఖ సిబ్బంది అక్కడ సోదాలు నిర్వహించారు. రూ.59 వేల విలువైన పది టేకు దిమ్మెలను స్వాధీనం చేసుకుని, పాల్వంచ డిపోకు తరలించారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు రేంజి అధికారి అనిల్ తెలిపారు.


ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు దిమ్మెలు


కాకర్లలో కలప లారీ పట్టివేత

జూలూరుపాడు, జూన్ 19: అటవీ అనుమతులు లేకుండా అక్రమంగా మామిడి కలపను తరలిస్తున్న లారీని మండలంలోని కాకర్ల గ్రామంలో బుధవారం అటవీ శాఖాధికారులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎఫ్‌ఆర్వో ప్రసాద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని కారుకొండ రామవరానికి చెందిన తండా రాములు అనే వ్యక్తి జూలూరుపాడు మండలంలోని కాకర్ల గ్రామంలో ఓ రైతుకు చెందిన మామిడి తోటను నరికించి లారీలో తరలిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలసి కాకర్ల గ్రామంలో లారీని పట్టుకున్నట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మూడు ఫోన్ల రికవరీ

సత్తుపల్లిరూరల్, జూన్19: సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రూ.35వేల విలువగల మూడు సెల్‌ఫోన్లను బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి అప్పగించినట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లు దొంగతనానికి గురైనా, పోగొట్టుకున్నా బాధితులు సెంట్రలైజ్డ్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే త్వరగా ఫోన్లు గుర్తించి బాధితులకు అప్పగిస్తామని అన్నారు. అదేవిధంగా సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేటప్పుడు పూర్తి జాగ్రత్తలు పాటించాలని, అనుమానం ఉంటే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘు, బాధితులు పాల్గొన్నారు.


బాధితురాలికి ఫోన్ అప్పగిస్తున్న సీఐ కిరణ్



నిరంకుశంగా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వం: పీడీఎస్‌యూ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 19: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోధి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, 14ఏళ్ల క్రితం ఓ సెమినార్‌లో ప్రముఖ రచయిత్రి అరుంధతిరాయ్ తప్పుగా మాట్లాడారని ఇప్పుడు ఆమేపై ఉపా చట్టాన్ని ప్రయోగించి కేసులు నమోదు చేస్తున్నారని పీవైఎల్, పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ నాయకులు విమర్శించారు. అరుంధతిరాయ్‌పై పెట్టిన ఉపా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో నిరసన ర్యాలీ చేపట్టి గట్టయ్య సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. మేదావులు, ప్రజాస్వామ్యవాదులు స్పందించి అరుంధతిరాయ్‌కు అండగా నిలవాలని కోరారు. ఆయా సంఘాల బాధ్యులు వీ వెంకటేష్, రాకేష్, గోకినపల్లి లలిత నాయకులు ఝాన్సీ, శోభ, సురేశ్, లక్ష్మణ్; చందు, రవీందర్, శ్రీను, విష్ణు, నరేందర్, రాకేష్ పాల్గొన్నారు.

వేగంగా సీతారామ లింక్ కెనాల్ పనులు

▸▸ సీతారామపై మంత్రి తుమ్మల ప్రత్యేక దృష్టి



పనులు జరుగుతున్న దృశ్యం

ఏన్కూరు,జూన్19: సీతారామ ఏన్కూరు లింక్ కెనాల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో రాత్రింబవళ్లు ముమ్మరంగా పనులు జరుగుఉతన్నాయి. త్వరగా పనులు పూర్తి చేయించి సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయించడానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషంగా కృషిచేస్తున్నారు. ఈమేరకు ఇప్పటికే మంత్రి తుమ్మల మూడుసార్లు కాలవపనులు పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులను కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రతిరోజు పనులు పురోగతిపై ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్నారు. మంత్రి తుమ్మల ప్రత్యేక దృష్టిపెట్టడంతో పనుల్లో మరింత వేగం పెరిగింది. సుమారు 4 కి.మీ. కాలవ పూర్తయింది. ఈప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ.100కోట్లు మంజూరుచేసింది. 8.66 కి.మీ. పొడవున ఆరు మీటర్ల వెడల్పుతో పనులు జరుగుతున్నాయి. ఈలింక్ కెనాల్ ను సాగర్ కాలవలో అనుసంధానం చేయడం ద్వారా సుమారు లక్షా 20వేల ఎకరలా భూమి సాగులోకి వస్తుంది. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు సస్యశ్యామలం కానున్నాయి. వైరా, లంకసాగర్ ప్రాజెక్టులు నిండనున్నాయి. వైరా నియోజకవర్గంలో సాగు, తాగునీటికి ఇబ్బందులు తొలిగిపోయనున్నాయి. లిఫ్టు ఇరిగేషన్లు పూర్తిస్థాయిలో పనిచేయడం ద్వారా మరింత భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉంది. వీటి పనులను ఎస్ఈ శ్రీనివాసరెడ్డి ఈఈ అర్జున్ డీఈ చంద్రశేఖర్ పర్యవేక్షిస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ: యువకుడికి తీవ్రగాయాలు



పెనుబల్లి, జూన్ 19: డివైడర్ వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన పెనుబల్లిలో బుధవారం జరిగింది. మండలంలోని టేకులపల్లి గ్రామానికి చెందిన గడ్డం ప్రవీణ్ ద్విచక్రవాహనంపై మండల కార్యాలయానికి వస్తుండగా మసీదు వద్ద రోడ్డును దాటుతున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ తలకు తీవ్రగాయాలు కావడంతో మొదట పెనుబల్లి ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. వీఎంబంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



వైరా, తల్లాడ, తిరుమలాయపాలెంలో రాహుల్‌గాంధీ జన్మదిన కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరా, జూన్ 19: వైరాలో బుధవారం జాతీయ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ జైపాల్, నాయకులు కట్ల రంగారావు, దొడ్డా పుల్లయ్య, ఎంపీపీ వేల్పుల పావని, జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం పాల్గొన్నారు.

మధిరటౌన్: మధిరలో జరిగిన రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మిరియాల రమణ , యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, మధార్, హరిబాబు, కర్నాటి రామారావు నాయకులు నిడమానూరు వంశీ, పాటిబండ్ల సత్యంబాబు, పారుపల్లి విజయ్, దారా బాలరాజు, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, బండారు నరసింహరావు, అద్దంకి రవి, మిరియాల కాశీ, జహంగీర్, గొల్లమందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు: వేంసూరు మండలం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సోమిరెడ్డి, మండల అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, మర్లపాడు ఎంపీటీసీ రాఘవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెల్ది జగన్మోహన్‌రావు, ఎండీ.ఫైజుద్దీన్, బొమ్మన బోయిన వెంకటేశ్వరరావు, అట్లూరి సత్యనారాయణరెడ్డి, యర్రా సత్యనారాయణ, భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, గరికపాటి శ్రీనివాసరావు, వేల్పుల బుచ్చాలు, భీమిరెడ్డి చెన్నకేశవరెడ్డి, కుక్కపల్లి శ్రీనివాసరావు, నాగులు, పుల్లారావు, రమేష్, కాంతారెడ్డి పాల్గొన్నారు.

తల్లాడలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

తిరుమలాయపాలెం: జడ్పీటీసీ బెల్లం శ్రీనుకాంగ్రెస్ నాయకులు పోట్ల కిరణ్, కరీం, దోమల రమేష్, నజీర్, రాజు, నాగేశ్వరరావు, వీరబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.



వేంసూరులో..

సంక్షేమ వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి

● ఎస్సీ, ఎస్టీ, బీసీ డీడీలకు సంక్షేమాధికారుల సంఘం వినతి



డీడీ కస్తాలకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 19: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలను కల్పించాలని తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కోటపాటి రుక్మారావు, ఎన్ నాగేశ్వరరావు కోరారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల డిప్యూటీ డైరెక్టర్లు కస్తాల సత్యనారాయణ, గుడికందుల జ్యోతి, విజయలక్ష్మీ లను వారు విడివిడిగా కలిసి వినతిపత్రాలను అందించారు. వసతిగృహాలకు రంగులు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ ఉపకరణాలు, తలుపులు, కిటికీలు మరమ్మతులు చేపట్టేందుకు కార్యచరణ చేయాలని కోరారు. సంక్షేమాధికారులు ఎం వీరయ్య, తిరుపతిరావు, ఎన్ విజయ, ఎం వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



నీట్ ర్యాంకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వైరా, జూన్ 19: వైరాలోని వాణీ వివేకానంద విద్యాలయ పూర్వ విద్యార్థి నీట్‌లో ర్యాంకు సాధించిన కొప్పుల మోహిత్‌ను బుధవారం ఆ విద్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సన్మానించారు. నీట్‌లో 720మార్కులకుగానూ 557మార్కులు సాధించాడు. కార్యక్రమంలో వాణీవివేకానంద విద్యాలయ కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వాణీ, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ కట్ల రంగారావు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి పై దాడి

మధిరటౌన్, జూన్ 19: పోలీస్ స్టేషన్ ముందు ఓ యువకుడి పై దాడికి దిగిన సంఘటన బుధవారం మధిర టౌన్ పోలీస్ స్టేషన్ ముందు జరిగింది. మధిర ఎస్సీ కాలనీ కి చెందిన కూరపాటి చరణ్ స్థానిక లడకబజారు కు చెందిన మానస ఇరువురు పెద్దలను ఎదిరించి మూడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. దీనితో మానస కుటుంబసభ్యులు చరణ్ పై మధిర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు, విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన చరణ్‌ను స్టేషన్ గేటు ముందు మానస కుటుంబ సభ్యులు బొందల వంశీ, బొందల సత్తి, బొందల రాజు, బొందల సత్యవతి అందరూ చూస్తుండగానే దాడి చేశారు. దీనితో చరణ్ ఫిర్యాదు మేరకు నలుగురి పై 324, 323, 294బి, 506ఆర్‌డబ్ల్యు 34 ఐపీసీ సెక్షన్ ల క్రింద కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపారు.

నేలకొండపల్లి సొసైటీ అధ్యక్షుడి అరెస్టు

నేలకొండపల్లి, జూన్ 19: మండల పరిధిలోని కోనాయగూడేనికి చెందిన నేలకొండపల్లి సహకార సంఘం అధ్యక్షుడు కోటి సైదిరెడ్డిని నేలకొండపల్లి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే 2022లో గ్రామంలోని ఓమహిళ ఇంటిపై దాడి కేసులో సైదిరెడ్డిపై నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైఉంది. రాజకీయ ఒత్తిళ్లతో అప్పట్లో పోలీసులు సైదిరెడ్డిని అరెస్టు చేయలేదు. అదే కేసులో బుధవారం సైదిరెడ్డిని నేలకొండపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన

తల్లాడ, జూన్ 19: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్ మాట్లాడుతూ గురువారం తల్లాడ మండలంలోని 6750మంది 19సంవత్సరాల్లోపు వారికి నులిపురుగుల నివారణ కోసం మాత్రలను వేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహేష్, శ్రీనివాస్, స్రవంతి, హెల్త్ సూపర్‌వైజర్లు కె.పెద్దపుల్లయ్య, మేరమ్మ, వసంతకుమారి, భద్రమ్మ, కళావతి, కృష్ణ పాల్గొన్నారు.

మోదీ ప్లెక్సీకి క్షీరాభిషేకం

తల్లాడ, జూన్ 19: పీఎం కిసాన్ సమాన్ నిధియోజన విడుదల సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ప్లెక్సీకి బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్లో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చల్లా నాగులు, ఉపాధ్యక్షురాలు నన్నపనేని శారదా, ప్రధాన కార్యదర్శి గాదె కృష్ణారావు, ఓబీసీ మోర్చా నాయకుడు వాడవల్లి నాగేశ్వరరావు, యువమోర్చా అధ్యక్షుడు వెల్లంకి సుధాకర్, కార్యదర్శి రాయల రమేష్, నాయకులు చల్లా నరేష్, పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై అంగన్‌వాడీ కేంద్రాలలో శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 19: 2024 25వ సంవత్సరానికి గాను అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా రివైజుడు ప్రీ స్కూల్ కరికులం బోధనపై ఖమ్మం జిల్లా స్థాయిలో గల ఏడు ప్రాజెక్టుల నుంచి పదిమంది సూపరివైజర్లకు ఐదు రోజులపాటు హైదరాబాదులో శిక్షణ ఇచ్చామని, శిక్షణ కార్యక్రమాలు అనంతరం ప్రతి ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ టీచర్ కి మూడు రోజులపాటు ఒక్కో బ్యాచ్ కి 35 మంది చొప్పున శిక్షణ ఇస్తామని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ డైరెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నుంచి ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు శిక్షణ అందిస్తామన్నారు. ఖమ్మం టీఎన్‌జీఓ ఫంక్షన్ హాల్లో ప్రాజెక్టులో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. మెదటి రోజు రఘునాధపాలెం మండలంలో మూడు సెక్టార్ల కు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లు 35 మందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సూపర్‌వైజర్ సత్యశీల ,నాగమణి సీడీపీవో కవిత, సూపర్‌వైజర్లు, పోషన్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ బాబు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ కార్యక్రమం

కల్లూరు: కల్లూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో బుధవారం అంగన్వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారిణీ మెహారున్నీసా బేగం ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిసోర్సు పరస్‌గా చంద్రుపట్ల సెక్టార్ సూపర్వైజర్ సుజాత అంగన్వాడీ టీచర్లకు శిక్షణకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓలు రత్తమ్మ, మహబూబ్‌అలీ, సూపర్వైజర్లు భవానీ, విజయలక్ష్మీ పలు గ్రామాల అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు

▸▸ హాజరుకానున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి

నేలకొండపల్లి, జూన్ 19: నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నేలకొండపల్లి కూసుమంచి రోడ్డులోని వాసవీభవన్‌లో నియోజకవర్గ స్థాయి రైతు అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు పొన్నగాని శ్రీనివాస్, సదస్సు నిర్వాహకులు యలమద్ది లెనిన్, చావా గణపతిరావులు చెప్పారు. సదస్సులో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు సదస్సులో పాల్గొంటారని మేలైన యాజమాన్య పద్దతులు, యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పా రు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీలపై వివరణ, రైతు సోదరుల సందేహాలకు విషయ నిపుణులైన శాస్త్రవేత్తలచే సమాధానాలుంటాయన్నారు. రైతులకు అవగాహన కోసం రైతు సదస్సులను నిర్వహించటం భక్తరామదాసు సర్వీస్ సొసైటీ కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నదన్నారు.రైతు అవగాహనా సదస్సును విజయవంతం చేయాలని శ్రీనివాస్, లెనిన్, గణపతిరావు కోరారు.

నాణ్యత లేని జామాయిల్ మొక్కలు సరఫరా

▸▸ ఐటీసీపై చర్యలు తీసుకోవాలని మల్లారం రైతుల డిమాండ్

మధిరరూరల్, జూన్ 19: మధిర మండలం మల్లారం గ్రామంలో పలువురు రైతులకు ఐటీసీ వారు నాణ్యత లేని జామాయిల్ మొక్కలను సరఫరా చేశారని ఆ మొక్కలు వేసిన రైతుల పంట ఎదుగుదల లేక తీవ్రంగా నష్టపోయారని, ఐటీసీ వారిపై చర్యలు తీసుకోవాలని మల్లారం రైతులు డిమాండ్ చేశారు. బుధవారం ఆగ్రామానికి వచ్చిన ఐటీసీ ఉద్యోగి చంద్రయ్యను రైతులు నిలదీశారు. రైతులు ఏలూరి నాగేశ్వరరావు, ఉపేంద్ర, చావా నరేష్, కొంగర రంగారావు, కొంగర కృష్ణారావులు విలేకరులతో మాట్లాడారు. మల్లారం గ్రామంలో 12మంది రైతులు 50ఎకరాలకు సరిపడా ఐటీసీ నుంచి జామాయిల్ మొక్కలు కొనుగోలు చేశారు. అయితే ఈ మొక్కలు వేసిన రైతులందరూ పంట సంవత్సరం అయిన దగ్గరి నుంచి జామాయిల్ చెట్టు కర్రలు పూర్తిగా విరిగిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ 50ఎకరాల్లో 12మంది రైతులకు చెందిన పొలాల్లో విరిగిపోయిన జామాయిల్ కర్రలను ఫొటోలు తీసి స్థానిక రైతులు ఐటీసీ అధికారులకు కూడా పంపించారు. నాణ్యత లేని మొక్కలు ఇవ్వడం కారణంగానే ఇలా జరిగిందని రైతులకు ఐటీసీ వారు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు, ఉద్యోగులు



కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న టీజీవో నాయకులు, ఉద్యోగులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్19: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ముజమ్మిల్‌ఖాన్‌ను బుధవారం కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు కలిశారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆయనను టీఎన్జీవో నాయకులు నందగిరి శ్రీనివాస్, ఆర్వీఎస్ సాగర్, టీజీవో నాయకులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి తదితరులు కలిశారు. ఆ తర్వాత వివిధ శాఖ అధికారులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చాలిచ్చి అభినందించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి మాలతి, ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాసులు, జిల్లా రిజిస్ట్రార్ అడపా రవీందర్, జిల్లా పౌరసరఫరా సంస్థ మేనేజర్ గంటా శ్రీలత, డీఈవో సోమశేఖరశర్మ, బీసీ,ఎస్సీ, సంక్షేమ అధికారులు జ్యోతి, సత్యనారాయణ తదితరులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చాలిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వైరా, జూన్ 19: రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో బుధవారం మండలంలోని 33మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌కు చెందిన రూ.33.33లక్షలపై చిలుకు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరునెలల కిందటి వరకు రాష్ట్రంలో నియంతృత్వ పాలన నడిచిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అలాగే రైతులకు రూ.రెండులక్షల రుణమాఫీని కచ్చితంగా అమలుచేస్తుందని స్పష్టం చేశారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, నాయబ్ తహసీల్దార్ సీహెచ్.సురేష్‌బాబు, గిర్దావర్‌లు ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఎంపీపీ వేల్పుల పావని, జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, పలువురు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు

నేలకొండపల్లి, జూన్ 19: ప్రభుత్వం అర్హులకు అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని నేలకొండపల్లి ఎంపీడీఓ ఎర్రయ్య చెప్పారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవటానికి కటాఫ్ తేదీ ఏదీ లేదని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. ఇటీవలి వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో దరఖాస్తులు తీసుకోలేదని, ఇక నుంచి సెలవు దినాల్లో తప్ప అర్హులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మాల మహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్19: జిల్లా మాలమహానాడు విస్తృత స్థాయి సమావేశం బుధవారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొట్టె సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి కనకరాజు, కోశాధికారిగా ఎజ్జు ఏలియాతో పాటు మరికొంతమందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసమావేశంలో గుంతేటి వీరభద్రం, కామా ప్రభాకర్, జమ్మి వీరబాబు, దాసరి శ్రీనివాస్, చింతమాల సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి మండలంలో భారీ వర్షం

కారేపల్లి జూన్ 19: మండల వ్యాప్తంగా బుధవారం ఉరుములు, మెరుపులతో కూడినవర్షం కురిసింది. ఈ వర్షంతో రైతులు అనందంవ్యక్తం చేస్తున్నారు. రైతులు విత్తుకున్న తరువాత వర్షాలు పడకపోవడంతో అవి భూమిలోనే ఎండిపోతున్నసమయంలో కురిసినవర్షంతో అవిమొలకెత్తుతాయని రైతులు ఆశాభావం వ్యక్తంచేశారు. మరోవైపు చెరువులు,కుంటలుపూర్తిగా ఎండిపోవడంతో పశువులు నీటి కోసంఅల్లడుతున్న సమయంలో కుంటలలోకి కొద్దిపాటి వర్షం నీరుచేరాయి.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలి

తిరుమలాయపాలెం, జూన్19: ఎన్నికల సమయంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఒకలాగా ఎన్నికల తర్వాత ఒకలా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలుచేయాలని, అలాగే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అందరికి వర్తింపచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ మండల నాయకులు కొప్పుల వెంకటరావు, మండల అధ్యక్షుడు నామా ప్రసాద్, మల్లీడి రమేష్, మల్లీడి భాగ్యమ్మ, మల్లీడి నాగన్న, పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయల పంటల సాగు పెంచాలి

▸▸ ఉద్యాన శాఖ అధికారులకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశం



కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న బీవీ రమణ

ఖమ్మంవ్యవసాయం, జూన్19: ఆయిల్‌పామ్ పంటతో పాటు కూరగాయల సాగు విస్తీర్ణం పెంచాలని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా ఉద్యానవన శాఖ పట్టుపరిశ్రమలశాఖలను కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను జిల్లా ఉద్యానపట్టుపరిశ్రమల అధికారి బీవీ రమణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 10వేల ఎకరాలో ఆయిల్‌పామ్ తోటలను సాగులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతోపాటు ఉద్యాన, కూరగాయల సాగు సైతం పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

మండలంలో 30 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి

కల్లూరు, జూన్ 19: ఎన్నో సంత్సరాలుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో ఎట్టకేలకు బుధవారం కల్లూరు మండలంలో కోలాహలంగా సాగింది. మండలంలో పనిచేస్తున్న సెకండరీ గ్రేట్ టీచర్లకు, భాషా పండితులకు ఉద్యోగోతులు వచ్చాయి. దీంతో వారు సంతోషం వ్యక్తంచేశారు. మండలంలో సుమారు 30 మంది ఉపాధ్యాయులు కోరుకున్న పాఠశాలలో పోస్టింగులు అందుకోవటం ఆనందదాయకమని మండల పీఆర్టీయూ సంఘ అధ్యక్ష, కార్యదర్శిలు పాకాల రమేష్, ఎస్‌కే చంద్‌సాహెబ్, జిల్లా నాయకులు బోబోలు శ్రీనివాసరావులు అన్నారు. ఆ క్రమంలో మండల మానవ వనరుల కార్యాలయంలో ఎంఈఓ దామోదర ప్రసాద్ పదోన్నతి పొందిన పలువురు ఉపాధ్యాయులకు ఉత్తర్వులను అందజేశారు. అయితే ఈ ఉద్యోగోన్నతులు కోర్టు ఇచ్చే తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఉంటాయని యూనియన్ నాయకులు తెలిపారు.

జేవీఆర్ పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దాలి

▸▸ ఎమ్మెల్యే రాగమయి ▸▸ సత్తుపల్లిలో విస్తృత పర్యటన



జేవీఆర్ పార్క్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూన్19: సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బుధవారం నియోజకవర్గ కేంద్రంలో పర్యటించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేశారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. పట్టణ శివారులోని మునిసిపాలిటీ నిధులతో నిర్మిస్తున్న శ్రీ వివేకానంద ఎక్సలెన్సీని సందర్శించి ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం నిర్మాణాన్ని పరిశీలించి పలు సూచనలు అందించారు. శ్రీ షిర్డి సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణానికి ఆహ్లాదాన్ని పంచేందుకు గతంలో నిర్మించి ప్రజల నిరాధరణకు గురైన జేవీఆర్ పార్క్‌ను సందర్శించారు. గత ప్రభుత్వ పాలనకు నిలువుటద్దంలా మారిందనేందుకు అధ్వానంగా మారిన పార్క్ ఉదాహరణ అని, అన్ని హంగులతో సుందరవనంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబును ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, చల్లగుళ్ల నరసింహారావు తదితరులున్నారు.